సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



స్తంభించిన ‘మీసేవ’లు

జిల్లాలో గురువారం సర్వర్ సమస్యతో మీసేవ కేంద్రాలలో సేవలకు అంతరాయం ఏర్పడింది.

- 9లో ▸



గుట్టల్లో ఇసుక డంపులు

బిచ్కుంద మండలంలోని మంజీర నది నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.8 /22.6

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పీజీ సెకండియర్ ఫలితాల విడుదల



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) పీజీ ద్వితీయ సంవత్సరం ఫలితాలు విడుదలయ్యాయి. ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూలోని 8 కోర్సులకు సంబంధించిన రెండో సెమిస్టర్ ఫలితాలను తెలంగాణ యూనివర్సిటీ పరీక్షలు నియంత్రణ అధికారి అరుణ, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ గురువారం విడుదల చేశారు. 85 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో పీజీ అడిషనల్ కంట్రోలర్ ప్రొఫెసర్ సాయిలు, కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి కిష్టయ్య, అడిషనల్ కంట్రోలర్లు మానస, రాములు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



పెద్దకొడప్‌గల్: మండలంలో వర్షాలతో నష్టపోయిన పత్తి పంటను గురువారం జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలతో మండలంలో పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంట మురిగిపోతుండడంతో ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు బుధవారం మండలకేంద్రంలో రాస్తారోకో చేశారు. దీంతో స్పందించిన జిల్లా వ్యవసాయ అధికారి గురువారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త అనిల్‌రెడ్డి, రేవంత్ మాట్లాడుతూ వర్షాలతో దెబ్బతిన్న పత్తి మొక్కలు తిరిగి చిగురిస్తాయని, పంట దిగుబడి మాత్రం తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. వర్షాలతో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ కమిషనర్, కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లామని డీఏవో తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కిషన్, ఏఈవోలు రూప, రాజ్యలక్ష్మి, మాధవి, కాటేపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

‘ఆర్థికాభివృద్ధి సాధించాలి’



దోమకొండ: మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పెరటి కోళ్ల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో మహిళా సంఘాల సభ్యులకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 మందికి 800 కోళ్లను పంపిణీ చేశామన్నారు. వీటి పెంపకం ద్వారా ఆర్థిక చేయూత లభిస్తుందన్నారు. అనంతరం ఆయన డంపింగ్ యార్డు, కంపోస్టు షెడ్‌లను పరిశీలించారు. బాలుర ప్రభుత్వ పాఠశాలలో ఇంకుడు గుంతలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున గ్రామాలలో ఫాగింగ్ చేయించాలని మండల ప్రత్యేకాధికారి జ్యోతికి సూచించారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఐకేపీ ఏపీవో రాజు, ఏఈ ప్రదీప్ పాల్గొన్నారు.


అడవులను నరికితే చర్యలు



ఎల్లారెడ్డి: అడవులలోని చెట్లను నరికితే కేసులు అవుతాయి తప్ప పట్టాలు రావని ఎఫ్‌డీవో రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం హాజీపూర్ అటవీ ప్రాంతంలో అక్రమార్కులు చెట్లు నరికి వేసిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005 డిసెంబర్ 13 వ తేదీకంటే ముందునుంచి అటవీ భూములను సాగు చేసుకుంటున్నవారికి మాత్రమే ప్రభుత్వం పోడు పట్టాలను అందించిందన్నారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం అటవీ ప్రాంతంలోని చెట్లను కాపాడే బాధ్యత సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులపై ఉంటుందన్నారు. హాజీపూర్ అటవీ ప్రాంతంలో ఇటీవల చెట్లు నరికిన తొమ్మిదిమందిపై కేసులు నమోదు చేశామన్నారు. ప్రతి ఒక్కరు అడవులను కాపాడడంలో సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

దరువేస్తున్న ధరలు

ధరలు దరువేస్తున్నాయి. ఉల్లి, వెల్లుల్లి ధరలు చుక్కలనంటుతున్నాయి. మార్కెట్‌లో కిలో ఎల్లిగడ్డల ధర రూ. 480కి చేరగా.. ఉల్లిగడ్డలు రూ. 80 పలుకుతున్నాయి. ధరలు గణనీయంగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



- ఎల్లిపాయల ధర కిలోకు రూ. 480
- రూ.80 కి చేరిన తెల్ల ఉల్లిగడ్డలు
- ఇబ్బందిపడుతున్న సామాన్యులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: కూరగాయల భోజనమైనా, మాంసాహారమైనా వంటలో ఉల్లి, వెల్లుల్లి ఉండాల్సిందే.. అవి లేకపోతే రుచీపచీ ఉండవు. అయితే ఉల్లి గడ్డలు, ఎల్లిగడ్డల ధరలు కొండెక్కుతున్నాయి. కామారెడ్డి మార్కెట్‌లో వెల్లుల్లి(ఎల్లిగడ్డ) పావుకిలో రూ.120 అమ్ముతున్నారు. మరింత నాణ్యమైనది అయితే రూ.140 నుంచి రూ.150 దాకా పలుకుతోంది. దీంతో పావుకిలో ఎల్లిగడ్డలు కొనాలంటే జంకాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి ఇంట్లో అల్లం, ఎల్లిగడ్డలను వాడతారు. నెలలో చిన్న కుటుంబం కనీసం అర కిలో అల్లం, వెల్లుల్లి పేస్ట్ వినియోగిస్తుంది. పెద్ద కుటుంబంలో వినియోగం మరింత ఎక్కువగా ఉంటుంది. ధరలు పెరగడంతో పేద, మధ్య తరగతి ఇళ్లలో ఎల్లిగడ్డ వాడకాన్ని తగ్గిస్తున్నారు.

ఉల్లిగడ్డ ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. మార్కెట్‌లో కిలో తెల్ల ఉల్లిగడ్డ ధర రూ.80 పలుకుతోంది. అది కూడా సాధారణమైనదే. నాణ్యమైనవి అయితే రూ. వంద దాకా అమ్ముతున్నారు. సాధారణ ఎర్ర ఉల్లి గడ్డ కిలోకు రూ.60 కి విక్రయిస్తున్నారు. నాణ్యమైనది రూ.80 దాకా అమ్ముతున్నారు. ప్రతి కుటుంబం నెలకు మూడు నాలుగు కిలోల ఉల్లిగడ్డలు వాడుతుంది. పెరిగిన ధరలతో ఉల్లి కొనడం భారంగా మారిందని సామాన్యులు ఆవేదన చెందుతున్నారు.

బ్లాక్ చేస్తున్న దళారులు

ఉల్లిగడ్డ ధరలు పెరగడానికి అక్రమ నిల్వలు కూడా కారణమని తెలుస్తోంది. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న ఉల్లిని ఎక్కడికక్కడ దళారులు నిల్వ చేస్తున్నారు. దీంతో కొత్త ఉల్లిగడ్డ వచ్చే దాకా ధరలు పెరుగుతూనే ఉండే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ధరల నియంత్రణ విషయంలో పౌరసరఫరాల శాఖ పెద్దగా పట్టించుకోకపోవడం దళారులకు కలిసి వస్తోంది. ఇది సామాన్యుడికి భారంగా మారుతోంది. ఉల్లి గడ్డతో పాటు ఎల్లిపాయల ధరలు నియంత్రించడంపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

రాయితీపై అందించాలి



కొంతకాలంగా ఉల్లిగడ్డ ధర పెరుగుతూ పోతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ. 60 నుంచి రూ. 80 ల వరకు అమ్ముతున్నారు. ధరలు ఇలా పెరిగితే ఎలా కొనేది. ప్రభుత్వం రాయితీపై ఉల్లి గడ్డలు, ఎల్లిగడ్డలు ఇవ్వాలి.

– వెంకవ్వ, మత్తమాల

ధర బాగా పెరిగింది



వెల్లుల్లి ధర బాగా పెరిగింది. మార్కెట్‌లో కిలో రూ. 480 పలుకుతోంది. దీంతో వెల్లుల్లి కొనే పరిస్థితి లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించి ధరలు అదుపులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– చాకలి రాజమణి, మత్తమాల

‘ఆధునికీకరణ’ పూర్తయ్యేదెప్పుడో?



టర్బయిన్ మరమ్మతుల కోసం తెప్పించిన సామగ్రి

- నత్తనడకన సాగుతున్న పనులు
- జల వెలుగులకు దూరమైన ‘నిజాంసాగర్’

నిజాంసాగర్: రాష్ట్రంలోనే మొట్టమొదటి హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ జనరేషన్ (జలవిద్యుదుత్పత్తి) కేంద్రం ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండేళ్లవుతున్నా పనులు పూర్తి కాకపోవడంతో జల విద్యుదుత్పత్తి కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కావడం లేదు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు అనుసంధానంగా 1954 సంవత్సరంలో హెడ్ స్లూయిస్ వద్ద 15 మెగా వాట్ల సామర్థ్యంతో జలవిద్యుదుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇంగ్లండ్ నుంచి మూడు టర్బయిన్లను తీసుకువచ్చారు. ఒక్కో టర్బయిన్ రోజుకు 5 మెగావాట్ల జల విద్యుదుత్పత్తి సామర్థ్యం కలిగి ఉంది. అయితే మూడో టర్బయిన్ 1974 సంవత్సరంలో మొరాయించింది. దానికి మరమ్మతులు చేయించకపోవడంతో రెండు టర్బయిన్ల ద్వారానే జలవిద్యుదుత్పత్తి జరుగుతోంది. ఆ రెంటిలోనూ అప్పుడప్పుడు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో జల విద్యుదుత్పత్తి కేంద్రం టర్బయిన్ల ఆధునికీకరణతో పాటు ఆటోమెటిక్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా జలవిద్యుదుత్పత్తికి పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జెన్‌కో అధికారులు ప్రతిపాదించారు. ప్రభుత్వం రెండేళ్ల క్రితం రూ. 12 కోట్లు మంజూరు చేసింది. గతేడాది ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. టర్బయిన్ల మరమ్మతులు, కాలం చెల్లిన వైర్లు, పరికరాల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి.

విద్యుదుత్పత్తికి బ్రేక్

ఇటీవల కురిసిన వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో గేట్ల ద్వారా మంజీర నదిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. ఆధునికీకరణ పనులతో రెండేళ్లుగా విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదు. పనులను త్వరగా పూర్తి చేసి ఉంటే జల విద్యుదుత్పత్తి చేయడానికి అవకాశం ఉండేది. పనుల విషయమై ఆర్అండ్‌బీ ఏడీ రవి కుమార్ వివరణ కోరగా.. ముందుగా అనుకున్నదానికంటే ఎక్కువగా టర్బయిన్లకు మరమ్మతులు అవసరం అవుతున్నాయన్నారు. ప్రస్తుతం రెండో టర్బయిన్‌కు మరమ్మతులు చేయిస్తున్నామని పేర్కొన్నారు. కాలం చెల్లిన పరికరాల స్థానంలో కొత్తవి తెప్పిస్తున్నామని, అవి ఒక్కటొక్కటిగా వస్తున్నాయని దీంతో పనులు కాస్త నెమ్మదిగా సాగుతున్నాయని పేర్కొన్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే



జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో కరీంనగర్, సిద్దిపేట బస్సులు నిలిపే ప్రాంతం అధ్వానంగా ఉంది. ఆర్టీసీ కార్గో షెడ్ పక్కన మురికి నీరు పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. అధికారులు స్పందించి బస్టాండ్ పరిసరాలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

‘మహిళా శక్తి’లో ప్రగతి సాధించాలి

- బ్యాంక్ లింకేజీ రుణాలను రికవరీ చేయాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: మహిళా శక్తి కార్యక్రమాల్లో ప్రగతి సాధించాలని, ఈ కార్యక్రమంలో జిల్లా ముందుడేలా చూడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, సెర్ప్ డీపీఎం, ఏపీఎం, సీసీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు తగిన ఉపాధి మార్గాల కోసం బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి తదితర ఆర్థిక సంస్థల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. వారు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంక్ లింకేజీ కింద ఇచ్చిన రుణాలను వంద శాతం రికవరీ చేయాలని సీసీలను ఆదేశించారు. మహిళా శక్తిలో ప్రగతి సాధించని ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ బి.రవికాంత్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, శ్రీనిధి జిల్లా మేనేజర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిర్వహించాలి

కామారెడ్డి టౌన్: నిజాంపాలన నుంచి తెలంగాణకు విముక్తి లభించిన సెప్టెంబర్ 17వ తేదీన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు ఈనెల 17 న తెలంగాణ ప్రజా పాలన కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమ నిర్వహణకు శాఖల వారీగా కేటాయించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రంగనాథ్‌రావు, డీఎస్పీ నరసింహారెడ్డి, సీపీవో రాజారాం, మున్సిపల్ కమిషనర్ సుజాత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- ఇంటి నిర్మాణం ఆన్‌లైన్‌లో నమోదు కోసం లంచం డిమాండ్
- రూ.8 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



విచారణ చేస్తున్న ఏసీబీ అధికారులు



ఏసీబీకి చిక్కిన కార్యదర్శి నవీన్‌కుమార్

నందిపేట్ : నందిపేట పంచాయతీ కార్యదర్శి నవీన్‌కుమార్ ఏసీబీకి చిక్కాడు. రూ.8వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. నిజామాబాద్ ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ వివరాలను వెల్లడించారు. నందిపేట మండలం కంఠం గ్రామానికి చెందిన సుభాష్ నందిపేటలోని రాజనగర్ ప్రాంతంలో ఇల్లు కట్టుకున్నాడు. అయితే తన పేరు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో పంచాయతీ కార్యదర్శి నవీన్‌కుమార్‌ను సంప్రదించగా.. రూ.10 వేలు లంచం డిమాండ్ చేశాడు. చివరకు రూ.8 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో సుభాష్ వారం రోజుల క్రితం ఏసీబీ అధికారులను సంప్రదించాడు. గురువారం పంచాయతీ కార్యాలయంలో రూ.8 వేలు లంచం తీసుకుంటుండగా నవీన్ కుమార్‌ను పట్టుకున్నామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. నవీన్‌కుమార్‌ను శుక్రవారం ఏసీబీ ప్రత్యేక కోర్టులో ప్రవేశపెడతామని పేర్కొన్నారు.

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి రూరల్: రక్తహీనత సమస్య రాకుండా ఉండేందుకు కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యార్థినులకు సూచించారు. టేక్రియాల్ కేజీబీవీతో పాటు ఉన్నత పాఠశాల గురువారం మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తహీనత సమస్యను తగ్గించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. అన్ని పాఠశాలల్లో కిశోర బాలికలకు రక్త పరీక్షలు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, వైస్ చైర్‌పర్సన్ ఉరుదొండ వనిత, డీడబ్ల్యూవో బావయ్య, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీఈవో రాజు, ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన అంబులెన్స్

- 161 వ నంబర్ జాతీయ రహదారిపై ఘటన
- హైవే అంబులెన్స్‌లో వెంటిలేటర్ కరువు
- ఆక్సిజన్ అందక బాలుడి మృతి



సాత్విక్ మాణే (ఫైల్)



డివైడర్ పైకి దూసుకొచ్చిన అంబులెన్స్

నిజాంసాగర్: సకాలంలో ఆస్పత్రులకు చేర్చి ప్రాణాలు నిలిపే అంబులెన్సే ఆ బాలుడి మరణానికి కారణమయ్యింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి డివైడర్‌ను ఢీకొట్టడం, హైవే అంబులెన్స్‌లో వెంటిలేటర్ సదుపాయం లేకపోవడంతో ఆక్సిజన్ అందక బాలుడు మృత్యువాతపడ్డాడు. నర్సింగ్‌రావుపల్లి శివారులోని 161 వ నంబర్(సంగారెడ్డి –నాందేడ్) జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా దేగావ్ గ్రామానికి చెందిన సుజాత మాణే, ఉమాకాంత్ మాణే దంపతులకు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కుమారుడు సాత్విక్ మాణే (5) న్యూమోనియాతో బాధపడుతుండడంతో మెరుగైన చికిత్స కోసం వారం క్రితం హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యం కోసం పొలం అమ్మి రూ. 11 లక్షలు ఖర్చు చేశారు. అయినా ఆరోగ్యం మెరుగవకపోవడం, వైద్యం చేయించడానికి డబ్బులు లేకపోవడంతో నిస్సహాయ స్థితిలో బాలుడిని నాందేడ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేందుకు తల్లిదండ్రులు ఏర్పాట్లు చేసుకున్నారు. వెంటిలేటర్ సదుపాయం ఉన్న అంబులెన్స్‌లో బాలుడిని తీసుకుని బుధవారం రాత్రి నాందేడ్ బయలుదేరారు. అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యంగా అతివేగంగా వాహనాన్ని నడపడంతో నర్సింగ్‌రావుపల్లి చౌరస్తా సమీపంలో డివైడర్‌ను ఢీకొంది. అంబులెన్స్ ఇంజన్ భాగం దెబ్బతిని డివైడర్ మధ్యలో ఇరుక్కుపోయింది. ప్రమాదం జరగ్గానే డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న జాతీయ రహదారి అంబులెన్స్‌లు ఘటనా స్థలానికి వచ్చినా.. వెంటిలేటర్ సదుపాయం లేకపోవడంతో బాలుడిని తరలించలేకపోయారు. దీంతో ప్రమాద స్థలిలో మూడు గంటల పాటు అంబులెన్స్‌లోనే ఉన్న బాలుడు.. చివరికి ఆక్సిజన్ అందక ప్రాణాలు విడిచాడు. అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే ప్రమాదం జరిగిందని మృతుడి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. నిజాంసాగర్ ఎస్సై సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



ట్రాలీ ఆటోలో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

ప్రైవేట్ వాహనాలే దిక్కు

నిజాంసాగర్(జుక్కల్): గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలలకు ఆటోల్లో వెళ్లాల్సి వస్తోంది. నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండల కేంద్రాలతో పాటు అచ్చంపేట ఆదర్శ మోడల్ పాఠశాలలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. నర్వ, గున్కుల్, మహమ్మద్‌నగర్, బూర్గుల్, తుంకిపల్లి, హసన్‌పల్లి, గాలీపూర్, కొమలంచ, సింగితం, మల్లూర్, ఒడ్డేపల్లి, మాగి, గోర్గల్ గ్రామాలకు సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. గురువారం ఉదయం సమీపంలోని గ్రామాలనుంచి నిజాంసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులు ట్రాలీ ఆటోలో వస్తున్న చిత్రాన్ని ‘సాక్షి’ కెమెరాలో బంధించింది. ఆయా గ్రామాలకు బస్సు సర్వీసులను నడపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్లుప్తంగా

నాగిరెడ్డిపేట కళాశాల ప్రిన్సిపాల్‌గా నరేందర్



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర కళాశాల ప్రిన్సిపాల్‌గా నరేందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఎల్లారెడ్డి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ హేమ చందర్ నాగిరెడ్డిపేట కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఇటీవల జరిగి న బదిలీల్లో భాగంగా ఆయన మెదక్ జిల్లా కొల్చారం కళాశాలకు వెళ్లారు. దీంతో లింగంపేట కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్‌కు నాగిరెడ్డిపేట కళాశాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన నాగిరెడ్డిపేట కళాశాలలో బాధ్యతలు చేపట్టారు.

ఇన్నోవేషన్ క్యాంప్‌లో జిల్లా విద్యార్థులు



కామారెడ్డి టౌన్ : హైదరాబాద్ శంషాబాద్‌లో ఈనెల 11, 12వ తేదీల్లో సమగ్ర శిక్ష అభియాన్, అఖిల భారత సాంకేతిక విద్యామండలి, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఇన్నోవేషన్ డిజైన్ ఇంటర్ ప్రెనర్‌షిప్ బూట్ శిబిరానికి జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. భిక్కనూరు బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థులు రఘు, గౌతం, చిన్నమల్లారెడ్డి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, విద్యార్థి శివసాయి, నిజాంసాగర్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు శశి శంకర్, విద్యార్థి ఉదయ్‌లు రెండు రోజుల పాటు శిబిరంలో పాల్గొని డిజైన్ ఇంటర్ ప్రెనర్ షిప్ అంశంపై మాట్లాడారు. రాష్ట్ర అధికారుల చేతుల మీదుగా ధ్రువపత్రాలను అందుకున్నట్లు వారు తెలిపారు.

మహమూద్‌కు గురుబ్రహ్మ పురస్కారం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన సీఆర్‌పీ(క్లస్టర్ రీసోర్స్ పర్సన్)గా బాధ్యతలు చేపడుతున్న మహమూద్ గురుబ్రహ్మ పురస్కారం అందుకున్నారు. సర్వేజన సుఖినోభవంతు ఎన్జీవో హైదరాబాద్ తరపున వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి పురస్కారాలను అందజేసినట్లు పేర్కొన్నారు. బడి బయట పిల్లలను బడిలో చేర్పించడం, ఆవాసా ప్రాంత పాఠశాలలను ఏర్పాటు చేయడంతో పాటు విశిష్ట సేవలు అందించినందుకు హైకోర్టు(రిటైర్డ్)జడ్జి చంద్రయ్య చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ వినియోగదారుల మండలి అధ్యక్షుడు మందాడి కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ వెంకటాచారి, ఉప సంచాలకులు పెరికే యాదయ్య తదితరులున్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి



నిజాంసాగర్(జుక్కల్) : తాతల కాలం నుంచి పంటలు సాగు చేస్తూ కబ్జాలో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ గురువారం మాగి గ్రామ రైతులు అటవీ, రెవెన్యూ శాఖల అధికారులకు వినతి పత్రం అందజేశారు. మాగి గ్రామ శివారులో పోడు భూముల జాయింట్ సర్వేకు వచ్చిన బాన్సువాడ అటవీ శాఖ రేంజ్ అధికారి అబీబ్‌ను గ్రామస్తు లు, రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జయప్రదీప్, దాబ శేఖర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మహా శ్రేష్టం..మట్టి గణపతి

- సదాశివనగర్‌లో పద్నాలుగేళ్లుగా మట్టిగణపతి తయారీ
- ఈ ఏడాది 14 ఫీట్ల ఎత్తులో ముస్తాబు
- ఆదర్శంగా నిలుస్తున్న కుమ్మరి మహేశ్



సదాశివనగర్‌లో మట్టితో తయారు చేసిన గణపతి వద్ద కుమ్మరి మహేశ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు పద్నాలుగేళ్లుగా కేవలం చేలల్లో బంక మట్టితో గణనాథుడిని ప్రతిష్ఠిస్తూ అందరికీ ఆదర్శనంగా నిలుస్తున్నాడు కుమ్మరి మహేశ్. మొదట రెండు ఫీట్లతో తయారు చేసి ప్రస్తుతం 14 ఫీట్ల ఎత్తు వరకు తయారు చేసి శభాష్ అనిపించుకుంటున్నాడు కుమ్మరి మహేశ్. తన స్నేహితులకు మట్టి గణపతులపై అవగాహన కల్పించి వారందరిక ఒక్కచోట చేర్చి 'మట్టి గణపతి యూత్' అని పేరుపెట్టి వారితో కలిసి చెరువు మట్టిని తీసుకొచ్చి పండుగకు పదిరోజుల నుంచి గణపతి తయారీకి ఏర్పాట్లు చేసుకుంటాడు మహేశ్. వినాయక చవితికి వినాయకుడిని తయారుచేసి నియమ నిష్ఠలతో తొమ్మిది రోజుల పాటు నిత్య పూజలు చేస్తున్నారు. సాంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు మహేశ్ మిత్ర బృందం. మహేశ్‌కు వచ్చిన సొంత ఆలోచనతో పద్నాలుగేళ్లుగా గణపతిని తయారు చేస్తున్నాడు. మొదటిసారి గణపతి తయారు చేసినప్పుడు కేవలం 2 ఫీట్ల వరకు, ప్రస్తుతం 14 ఫీట్ల ఎత్తు వరకు గణపతిని తయారు చేసినట్లు పేర్కొన్నాడు.

విగ్రహం తయారీ కోసం వరి గడ్డి, ఇనుప చువ్వలు, కుండల మట్టి, కర్రలు, ప్లైవుడ్ థర్మాకోల్‌ను ఉపయోగించినట్లు పేర్కొంటున్నాడు. కుమ్మరి మహేశ్ మట్టి గణపతి తయారు చేయడంలోనే కాకుండా మంచి ఆర్టిస్ట్‌గాను పేరుంది. ప్రధానంగా త్రీడీ పేయింటింగ్, వాల్ యూర ల్స్, గుళ్లు, ఇళ్లలో రంగులు వేయడంలో మంచి నిష్ణాతుడు. గ్రామంలో మట్టి గణపతికి మంచి ఆదరణ లభించడమే కాకుండా మహేశ్‌ను అభినందిస్తున్నారు. మట్టి గణపతి వద్ద అన్నదానం చేయడానికి భక్తులు పోటీ పడుతున్నారు.

మట్టితో తయారు చేసిన గణపతి చాలా శ్రేష్ఠమైనదని గ్రామస్తుల నమ్మకం. మట్టితో గణపతి తయారు చేయడం వల్ల చెరువు నీరు కలుషితం కాకుండా ఉంటుందని మహేశ్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాడు. నేటి యువతరానికి మహేశ్ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

అనాథకు కొత్త జీవితం !

- పెంచి పెద్దచేసి పెళ్లి చేసిన ఆశ్రమ నిర్వాహకులు
- ఇప్పటికి 16 మంది అనాథలకు పెళ్లిళ్లు
- అభినందించిన స్థానిక నేతలు



కవిత, గణేశ్ వివాహానికి హాజరైన ప్రముఖులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : లోకజ్ఞానం తెలియక ముందే కన్న తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారిని దోమకొండలోని బేథెల్ అనాథ ఆశ్రమ నిర్వాహకులు చేరదీశారు. పదేళ్లకు పైగా ఆశ్రమంలో పెరిగి పెద్దయిన ఆ యువతికి గురువారం వివాహం జరిపించారు. వివరాల్లోకి వెళితే....వేల్పూర్‌కు చెందిన సుంకరి కవిత, ఆమెకు ఒక చెల్లెలు ఉన్నారు. వీళ్ల పసిడి ప్రాయంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో అనాథలయ్యారు. కవితను నిజామాబాద్‌లోని ఓ ఆశ్రమంలో చేర్పించగా, ఆమె చెల్లెల్ని బంధువులు తీసుకువెళ్లారు. నిజామాబాద్‌లోని ఆశ్రమంలో కొంత కాలం ఉన్న తర్వాత దోమకొండలోని బేథెల్ అనాథ ఆశ్రమానికి తీసుకువచ్చి అప్పగించారు. ఆశ్రమ నిర్వాహకుడు దాస్ ఎల్లం, ఆయన సతీమణి సుగుణ ఆధీనంలో పదేళ్లుగా అక్కడే ఉండి ఆశ్రమంలో చదువు కూడా నేర్చుకుంది. దాస్ ఎల్లం దంపతులు ఆమెను తమ కూతురిగా భావించామని తెలిపారు. 21 ఏళ్లు రావడంతో ఆమెకు పెళ్లి చేయాలని భావించామని, ఇదే సమయంలో మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మానేపల్లికి చెందిన గణేశ్ పెళ్లి చేసుకునేందుకు ముందుకు రావడంతో వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి పెళ్లి చేయడానికి నిర్ణయించారు. గురువారం దోమకొండలో క్రిస్టియన్ సంప్రదాయంలో వారికి పెళ్లి జరిపించారు. ఈ సందర్భంగా స్థానిక మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్‌తో పాటు పలువురు ప్రముఖులు, అధికారులు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు. తాము ఆశ్రమం ప్రారంభించిన నాటి నుంచి పెరిగిన పిల్లల్లో ఇప్పటికీ 15 మందికి పెళ్లిళ్లు చేశామని, కవిత వివాహంతో పెళ్లిళ్ల సంఖ్య 16కు చేరిందని ఆశ్రమ నిర్వాహకుడు దాస్ ఎల్లం 'సాక్షి'తో మాట్లాడుతూ తెలిపారు.

ఊరంతటికి ఒకే వినాయకుడు..

- 30 ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ
- ఆదర్శంగా నిలుస్తున్న సురాయిపల్లి



సురాయిపల్లి జీపీ ఆవరణలో వినాయకుడి విగ్రహానికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

లింగంపేట(ఎల్లారెడ్డి) : సురాయిపల్లిలో ఆదినుంచి ఒక ఆనవాయితీ కొనసాగుతోంది. గ్రామంలో అన్ని కులాల వారు యువజన సంఘాలు, యూత్ కమిటీలు, అన్ని రాజకీయ పార్టీల వారు జీవిస్తున్నారు. కాని పండగల సమయాల్లో అందరూ ఏకమవుతారు. దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది, పండగలు అందరూ కలిసిమెలసి జరుపుకుంటారు. గ్రామంలో 30 ఏళ్లుగా వినాయక చవితి వచ్చిందంటే యువజన సంఘాలు, కుల సంఘాలు అందరూ కలిసి ఏకమై ఒకే వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకుంటారు. గ్రామంలో 1200మంది జనాభా ఉండగా 700వరకు ఓటర్లు ఉన్నారు. 30 ఏళ్లుగా గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి విగ్రహ దాతగా కొనసాగుతున్నారు. వినాయ నిమజ్జనం రోజు అన్ని వర్గాల వారు పాల్గొంటారు. వృధా ఖర్చులు చేయకుండా కలిసిమెలసి ఉత్సవాల్లో పాల్గొంటారు. గ్రామంలో అన్ని పార్టీల వారు ఉంటారు. కాని గ్రామం కట్టుబాట్ల ప్రకారం ఏ పార్టీ వారు జెండాలు ఏర్పాటు చేయవద్దు, జెండా గద్దెలు నిర్మించుకోవద్దు. ఇంటింటికీ వెళ్లి ఎవరికి వారు ప్రచారం చేసుకోవచ్చు. గ్రామస్తులంతా కట్టుబాట్లకు నిబద్ధతతో ఉండడం విశేషం. వినాయక చవితి రోజు అందరూ కలిసి గ్రామంలోని కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి పూజలు చేస్తారు.

గ్రామం ప్రత్యేకతలు..

- గ్రామంలో 30 ఏళ్లుగా ఒకే వినాయక విగ్రహం ఏర్పాటు
- గ్రామంలో బెల్టుషాపులు ఉండవు
- రెండు దశాబ్దాలుగా గ్రామంలో మద్యనిషేధం కొనసాగుతుంది.
- గ్రామంలో అన్ని రాజకీయ పార్టీలు ఉన్నాయి. ఎన్నికల సమయంతో ఏ పార్టీ వారు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరు. పార్టీల జెండా గద్దెలు ఏర్పాటు చేయరు.
- గ్రామంలో ఎలాంటి సమస్యనైనా పెద్దలచే పరిష్కరించుకుంటారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లరు. గ్రామంలో ఎలాంటి కేసులు ఉండవు.
- గ్రామస్తులంతా కలిసి పాఠశాల కోసం రెండు ఎకరాల భూమి కేటాయింపు

ఐకమత్యంగా ఉంటాం



గ్రామం కట్టుబాట్ల ప్రకారం అందరం 30 ఏళ్లుగా కలిసిమెలిసి ఐకమత్యంగా ఉంటాం. ఐకమత్యమే మా బలం. గ్రామంలో ఏ సమస్య వచ్చినా అందరం కలిసికట్టుగా కూర్చొని పరిష్కరించుకుంటాం. వినాయక చవితి పండగను అన్ని వర్గాల వారం కలిసి మెలసి జరుపుకుంటాం.

– రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, సురాయిపల్లి

సోయా పంటకు 'మద్దతు' కల్పించాలి



మాట్లాడుతున్న రైతు సంఘం చైర్మన్ గోపాల్

మద్నూర్(జుక్కల్) : ఇక్కడ రైతులు సోయాబీన్ పంటను ప్రధాన పంటగా పండిస్తుండడంతో ప్రభుత్వం మద్నూర్‌లో సోయా ఇండస్ట్రీ ఏర్పాటు, సోయా బీన్ పంటకు మద్దతు ధర కల్పించాలని మద్నూర్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ చాట్లావార్ గోపాల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఎంఎఫ్‌పీసీ డైరెక్టర్‌లు, రైతులతో రైతు ఉత్పత్తి దారుల సంఘం ద్వితీయ మహాజన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సభలో వారు పలు తీర్మానాలు చేశారు. సోయాబీన్ పంట దిగుబడులు మొదలయ్యాయని మద్దతు ధర కంటే బయటి మార్కెట్‌లో ధర తక్కువ ఉన్నందున రైతులు మద్దతు ధరకే విక్రయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ ఫారెస్ట్ అధికారి సుజాత, ఏవో రాజు, రైతులు పాల్గొన్నారు.

గణనాథుడికి ఘనమైన పూజలు



సదాశివనగర్‌లో పూజలందుకుంటున్న గణపయ్య



బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రిలో లంబోదరుడికి పూజలు చేస్తున్న సూపరింటెండెంట్ విజయలక్ష్మి



కృష్ణాజీవాడిలో శివాజీనగర్ త్రిశూల్ సేన ఆధ్వర్యంలో కుంకుమ పూజలు



జిల్లా కేంద్రంలోని శాంతిటాకీస్ రోడ్‌లో సాయి శ్రీనివాస్ గణేశ్ మండలి వద్ద 121 రకాల నైవేద్యాలు

జిల్లావ్యాప్తంగా గణేశ్ మండపాల వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు జరుగుతున్నాయి. మండపాల వద్ద అన్నదానాలు నిర్వహిస్తున్నారు. మహిళలు కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం వేళ చిన్నారుల కోలాటాలతో మండపాల వద్ద కోలాహలం నెలకొంది. కొన్నిచోట్ల గణనాథుల విగ్రహాలను నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



కామారెడ్డి పెద్ద చెరువులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న చిన్నారులు



దేవునిపల్లి సీతారాంనగర్ కాలనీలో వినాయక మండపం వద్ద అన్నదానం



టేక్రియాల్ చెరువులో వినాయక విగ్రహ నిమజ్జనం



దోమకొండలో నిమజ్జన శోభాయాత్ర



మర్కల్‌లో ఈతరం గణేశ్ మండలి వద్ద అన్నదానం



పట్టణంలో సంతోషి ఆదర్శ సంఘం వద్ద అన్నదానం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు



రాజంపేటలో అయోధ్య సేన ఆధ్వర్యంలో..



తాండూర్‌లో వినాయకుడి మండపం వద్ద యజ్ఞం



మద్నూర్‌లో గణనాథుడి విగ్రహం వద్ద చిన్నారులు



ఎల్లారెడ్డిలో న్యూఆబాది గణేశ్ మండలి వద్ద పూజలు

యూనియన్ ఎన్నికల్లో ఎంఈవో ప్రచారం

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖ పరిధిలోని ప్రధాన సంఘమైన పీఆర్టీయూ జిల్లా నూతన కార్యవర్గానికి ఎన్నికల ప్రచారం ప్రస్తుతం కొనసాగుతోంది. ఇటీవల వివిధ మండలాలకు నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేసిన పీఆర్టీయూ.. జిల్లా కార్యవర్గం ఎన్నికకు సిద్ధమైంది. ప్రస్తుతం బోధన్ నుంచి ప్రధాన కార్యదర్శిగా శంకర్ పోటీ చేస్తుండగా, ఆయనను గెలిపించాలని రుద్రూరు మండల విద్యాశాఖ అధికారి నాగనాథ్ వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేస్తున్నారు. గురువారం వర్ని, రుద్రూర్, బోధన్ మండలాలకు సంబంధించిన టీచర్ల గ్రూపుల్లో పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శిగా శంకర్‌ను గెలిపించాలని సంబంధిత టీచర్లను కోరారు. ఇలా మండల విద్యాశాఖ అధికా రి ప్రధాన సంఘం ఎన్నికలకు ప్రచారం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా.. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

క్రైం కార్నర్

పరిస్థితి విషమించి మృతి



నారాయణగౌడ్ (ఫైల్)

జక్రాన్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన అబ్బగోని నారాయణగౌడ్ (65) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి గ్రామ శివారులో ఈ నెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో నారాయణగౌడ్‌కు తీవ్రగాయాలు కాగా, నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.


ముత్యంపేటకు చెందిన యువకుడు..



రాము(ఫైల్)

దోమకొండ: మండలంలోని ముత్యంపేటకు చెందిన జొన్నల రాము(23) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం మాచారెడ్డి మండలం భవానీపేట – ఉగ్రవాయి స్టేజీ వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో గాయాలపాలైన రాముకు తీవ్ర గాయాలయ్యాయి. రామును హైదరాబాద్‌కు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు.

కుటుంబ సభ్యులకు వృద్ధుడి అప్పగింత



వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో తప్పిపోయిన వెస్ట్ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన వృద్ధుడు కృష్ణమూర్తిని రైల్వే ఎస్సై సాయిరెడ్డి గురువారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కృష్ణమూర్తి ఈనెల 9న నిజామాబాద్ రైల్వేస్టేషన్ తప్పిపోవడంతో కుటుంబ సభ్యులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పలుచోట్ల గాలించగా, గురువారం నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఆచూకీ లభించింది. వెంటనే వృద్ధుడి కుమారుడికి సమాచారం అందించి వారికి అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బోధన్‌రూరల్: మండలంలోని బండార్‌పల్లి శివారులో ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొని రాంపూర్ గ్రామానికి చెందిన మారుతి, నాగయ్య అనే ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు, గ్రామస్తులు చికిత్స నిమిత్తం బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నాగయ్య బోధన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, తీవ్రగాయాలపాలైన మారుతిని నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

కుక్కల దాడిలో జీపీ డ్రైవర్‌కు..

ఎడపల్లి (బోధన్): మండలంలోని బాపునగర్ గ్రామపంచాయతీ డ్రైవర్ సుందర్ కుక్కల దాడిలో గాయపడ్డారు. మండలంలోని ఏఆర్పీ క్యాంప్‌నకు చెందిన సుందర్ గ్రామపంచాయతీలో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం కుక్కలు దాడి చేయడంతో అతనికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


ఆరుగురిపై కేసు నమోదు

వర్ని: కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుమ్మరి భీమాశంకర్‌పై దాడి చేసిన ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. బుధవారం రాత్రి కాంగ్రెస్ పార్టీలోని మరో వర్గానికి చెందిన నాయకులు శంకర్‌పై దాడి చేసి గాయపర్చగా, బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

సిరికొండలో ముగ్గురిపై..

సిరికొండ: మండలంలోని వర్జన్ తండాకు చెందిన శ్రీకాంత్‌పై బుధవారం రాత్రి కర్రలతో దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రామ్ గురువారం తెలిపారు. శ్రీకాంత్‌పై నితిన్, శ్రీను, భాస్కర్ దాడి చేశారని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి అదృశ్యం



రాధాకిషన్

నవీపేట : మండల కేంద్రానికి చెందిన కారంగ్‌పురి రాధాకిషన్ (23) అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్ గురువారం తెలిపారు. ఈనెల 4న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన రాధాకిషన్ తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారని పేర్కొన్నారు. గత ఆరు సంవత్సరాలుగా రాధాకిషన్ మతిస్థిమితం సరిగా లేదన్నారు. రాధాకిషన్ తండ్రి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాపర్ చోరీ.. కేసు నమోదు

బోధన్‌రూరల్ : సాలూర మండలం సాలంపాడ్ క్యాంప్ శివారులో, బోధన్ మండలం నాగన్‌పల్లి గ్రామ శివారులోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి దుండగులు గురువారం కాపర్, కాయిల్స్, ఆయిల్ చోరీ చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ తెలిపారు. ట్రాన్స్‌కో ఏఈ కల్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మనస్తాపంతో ఆత్మహత్య

- అనారోగ్యం, ఎవరూ మాట్లాడకపోవడమే కారణం..
- హత్య కేసులో జైలుశిక్ష అనుభవించిన మృతుడు



గంగారాం(ఫైల్)

వర్ని: హత్య కేసులో పన్నెండేళ్లపాటు జైలు శిక్ష అనుభవించి ఇటీవలే బయటికి వచ్చిన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సాయన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన పన్నీరు పల్లికొండ గంగారాం.. 12 సంవత్సరాల క్రితం హత్య కేసులో జైలుకు వెళ్లి రెండు నెలల క్రితం బయటకు వచ్చాడు. జైల్లో ఉన్న సమయంలో గంగారాంకు కిడ్నీ ఆపరేషన్ అయ్యింది. బయటికి వచ్చిన తరువాత అనారోగ్య సమస్యలకు తోడు ఎవరూ మాట్లాడకపోవడంతో మనస్తాపం చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి మేనమామ లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంట్లో గొడవపడి..

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని పాతంగల్ శివారు అడవిలోని బుగ్గరామేశ్వరాలయం సమీపంలో సాకలి వెంకటి(26) అనే వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సంగారెడ్డి జిల్లా ఖాజాపూర్ మండలం సిర్గాపూర్ గ్రామానికి చెందిన సాకలి వెంకటి గాంధారిలో డ్రైవర్‌గా పనిసేవాడు. వెంకటికి అదే గ్రామానికి చెందిన రాణితో ఏడాదిన్నర క్రితం పెళ్లి జరిగింది. మద్యానికి బానిసైన వెంకటి రోజూ ఇంట్లో గొడవ పడేవాడు. కొన్ని రోజుల క్రితం సిర్గాపూర్‌కు వెళ్లిన అతడు.. మళ్లీ గొడవ పడి మూడు రోజుల క్రితం గాంధారి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయల్దేరాడు. అనుమానంతో కుటుంబ సభ్యులు వెతకగా గాంధారి – బాన్సువాడ ప్రధాన రహదారి పక్కన బుగ్గగండి ప్రాంతంలోని అడవిలో వెంకటి బైక్‌ను గుర్తించారు. అడవిలో వెతకగా బుగ్గరామేశ్వరాలయం సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకొని వెంకటి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతుడి తండ్రి హనుమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డీజే నిర్వాహకుల బైండోవర్



తహసీల్దార్ ఎదుట డీజే నిర్వాహకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన డీజే నిర్వాహకులను తహసీల్దార్ నరేందర్ ఎదుట ఎస్సై అరుణ్‌కుమార్ గురువారం బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద డీజేలు ఏర్పాటు చేసేందుకు అనుమతి లేదని, నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

దోమకొండ తహసీల్దార్ ఎదుట..

దోమకొండ: పీడీఎస్ బియ్యాన్ని అక్రమరవాణా చేస్తూ గతంలో కేసులు నమోదైన నలుగురిని గురువారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మాచారెడ్డి మండలం భవానీపేట్ తండాకు చెందిన అజ్మీరా వెంక్యా, అజ్మీరా అరవింద్, భూక్యా నరేందర్‌తోపాటు బియ్యం కొనుగోలు చేస్తున్న దోమకొండకు చెందిన రైస్‌మిల్ యజమానిని సైతం బైండోవర్ చేశామన్నారు.